APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com  తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి   ఎడిటర్ : సి హరికృష్ణ   సోమవారం 20, జూలై 2026   సంపుటి: 01   సంచిక :53   పేజీలు : 04   వెల: 2-00/-



## మూడు దేశాల పర్యటనకు రాష్ట్రపతి

- మోల్డోవా, ఉత్తర మాసిడోనియాకు తొలి పర్యటన
- మూడు దశాబ్దాల తర్వాత రొమేనియా సందర్శన
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యం

న్యూఢిల్లీ, జూలై 19 : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మూడు యూరప్ దేశాల అధికారిక పర్యటనకు బయలుదేరారు. మోల్డోవా, ఉత్తర మాసిడోనియా, రొమేనియా దేశాల్లో ఆమె పర్యటించనున్నారు. ఈ పర్యటనల ద్వారా ఆయా దేశాలతో భారతదేశం ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారత రాష్ట్రపతి హోదాలో మోల్డోవా, ఉత్తర మాసిడోనియా దేశాలను సందర్శించడం ఇదే తొలిసారి. ఈ చారిత్రాత్మక పర్యటనతో రాజకీయ, ఆర్థిక, వాణిజ్య, సాంస్కృతిక రంగాల్లో పరస్పర సహకారానికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని అధికారులు తెలిపారు. రొమేనియాకు భారత రాష్ట్రపతి అధికారికంగా వెళ్లడం మూడు దశాబ్దాలకుపైగా విరామం తర్వాత జరుగుతోంది. ఈ పర్యటన రెండు దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ స్నేహ సంబంధాలకు మరింత బలం చేకూర్చుతుందని భావిస్తున్నారు.పర్యటన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయా దేశాల అధ్యక్షులు, ప్రభుత్వ ప్రధానులు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరపనున్నారు. ద్వైపాక్షిక సహకారం, వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, సాంకేతికత తదితర రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించే అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది.భారత్‌తో స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ పర్యటనలు కీలకంగా మారనున్నాయని విదేశాంగ వర్గాలు పేర్కొంటున్నాయి.

## జాతీయ చలనచిత్ర పురస్కార విజేతలకు చంద్రబాబు అభినందనలు

- తెలుగు సినీ పరిశ్రమకు ప్రశంసలు
- కళా వారసత్వానికి సినిమా మూలస్తంభం
- మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష



అమరావతి, జూలై 19 : 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ద్వారా విడుదల చేసిన సందేశంలో అవార్డులు అందుకున్న కళాకారులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలుగు సినీ పరిశ్రమ సాధించిన విజయాలను కొనియాడారు. తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు తమ అసాధారణ ప్రతిభతో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించారని చంద్రబాబు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో తెలుగు సినిమా ప్రతిష్ఠను మరింత పెంచిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.కళ, సంస్కృతి, సినిమా అనేవి సమాజ అస్తిత్వానికి, వారసత్వానికి బలమైన మూలస్తంభాలని ముఖ్యమంత్రి అన్నారు. తెలుగు సినిమా సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యంతో ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందని, ఈ విజయ పరంపర భవిష్యత్తులో కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. జాతీయ చలనచిత్ర పురస్కారాలు అందుకున్న వారందరూ తమ ప్రతిభతో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చంద్రబాబు ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో తెలుగు చిత్ర పరిశ్రమ మరిన్ని విశిష్ట విజయాలు సాధించి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.తన సందేశంలో ప్రముఖ నటులు మమ్ముట్టి, యామీ గౌతమ్, కార్తీక్ ఆర్యన్, నిహారిక కొణిదెల, దర్శకుడు సుకుమార్‌లకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచిన వారందరికీ తన అభినందనలు తెలియజేస్తూ వారి భవిష్యత్ ప్రయాణం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

అలాగే జాతీయ పురస్కారాల్లో గుర్తింపు పొందిన 'పుష్ప 2', 'కల్కి 2898 ఏడీ', 'లక్కీ భాస్కర్' వంటి చిత్రాల విజయాన్ని కూడా చంద్రబాబు అభినందించారు. తెలుగు సినిమా ప్రపంచ సినీ రంగంలో మరింత ఉన్నత స్థానాన్ని సంపాదించి భారతీయ సినీ పరిశ్రమకు గర్వకారణంగా నిలవాలని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు.



## అమెరికా చేరుకున్న మంత్రి సీతక్కకు ఘన స్వాగతం

- టీటీఏ మహాసభలకు హాజరు
- ఉత్తర కరోలినాలో స్వాగతం
- తెలంగాణ ఖ్యాతిని చాటుతున్న ప్రవాసులు

షార్లెట్, జూలై 19 : టీటీఏ మహాసభల్లో పాల్గొనేందుకు అమెరికా చేరుకున్న రాష్ట్ర మంత్రి సీతక్కకు ఉత్తర కరోలినా రాష్ట్రంలోని షార్లెట్ విమానాశ్రయంలో టీటీఏ ప్రతినిధులు, ప్రవాస కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించి ఆమెకు ఆత్మీయ స్వాగతం తెలిపారు. మంత్రి సీతక్కకు వాణి రెడ్డి, విశ్వ కంది, నరేందర్ రెడ్డి, రాహుల్, గణేష్‌తో పాటు టీటీఏ ప్రతినిధులు, ప్రవాస భారతీయులు స్వాగతం పలికారు. అమెరికాలో తెలంగాణ ప్రజలు అందించిన ఆదరణకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ పేరును నిలబెడుతున్న ప్రవాస భారతీయుల సేవలు ప్రశంసనీయమని సీతక్క అన్నారు.

## తిరుమలలో వసతి గదుల కేటాయింపుకు కొత్త విధానం



- భక్తులకు నిరీక్షణకు చెక్
- ఉప విచారణ కార్యాలయాల ద్వారా గదులు
- డిజిటల్ విధానంతో వేగవంతమైన సేవలు

తిరుమల, జూలై 19 : శ్రీవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులు వసతి గదుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన ఇబ్బందులకు తిరుమల తిరుపతి దేవస్థానం చెక్ పెట్టింది. ఆధునిక సాంకేతికతతో కూడిన కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చి, కేంద్రీయ విచారణ కార్యాలయం వద్ద నమోదైన భక్తులకు ఉప విచారణ కార్యాలయాల ద్వారా వేగంగా గదులు కేటాయించే విధానాన్ని ప్రారంభించింది. దీంతో భక్తుల సమయం, శ్రమ గణనీయంగా ఆదా కానుంది. వసతి గది కావాలనుకునే భక్తులు ముందుగా కేంద్రీయ విచారణ కార్యాలయంలో ఉదయం 5 గంటల నుంచి గదులు అందుబాటులో ఉన్నంత వరకు నమోదు చేసుకోవాలి. నమోదు సమయంలో ఒరిజినల్ ఆధార్ కార్డు లేదా దాని ప్రతితో పాటు మొబైల్ నంబర్ సమర్పించాలి. అనంతరం ముఖ గుర్తింపు విధానం ద్వారా వివరాలు నమోదు చేసి, అవసరమైన గది కేటగిరీని ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. రూ.50, రూ.100 అద్దె గల గదులు ఒక విభాగంలో, రూ.1000 అద్దె గల గదులు మరో విభాగంలో అందుబాటులో ఉంటాయి.నమోదు పూర్తయిన తర్వాత భక్తులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తారు. అనంతరం కేంద్రీయ విచారణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిజిటల్ ప్రదర్శన బోర్డులపై నమోదు సంఖ్యల ఆధారంగా గది కేటాయింపు వివరాలు ప్రదర్శిస్తారు. నమోదు సంఖ్య ప్రదర్శించబడిన 15 నిమిషాల్లోపు భక్తుల మొబైల్ ఫోన్‌కు గది కేటాయించిన ఉప విచారణ కార్యాలయం వివరాలతో సందేశం పంపిస్తారు. సందేశం అందకపోయినా అక్కడ ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రంలో ధ్రువీకరణ పత్రాన్ని స్కాన్ చేసి గది వివరాలు తెలుసుకునే సౌకర్యం కల్పించారు. గది కేటాయించిన ఉప విచారణ కార్యాలయానికి వెళ్లిన తర్వాత భక్తులు గది అద్దెను తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలి. ఫోన్‌పే, గూగుల్ పే, యూపీఐ, క్రెడిట్ లేదా డెబిట్ కార్డుల ద్వారా చెల్లింపులు స్వీకరిస్తారు. నగదు చెల్లింపులకు అవకాశం ఉండదు. చెల్లింపు పూర్తయిన వెంటనే గది తాళాలను అందజేస్తారు. అంజనాద్రి నగర్, శేషాద్రి నగర్, శంఖుమిట్ట, గరుడాద్రి నగర్ కాటేజీలు, సప్తగిరి, వరాహస్వామి, కౌస్తుభం, పాంచజన్యం, నందకం తదితర విశ్రాంతి గృహాల ద్వారా ఈ సేవలు అందుబాటులో ఉంటాయి.వసతి గదుల కేటాయింపుకు కొన్ని నిబంధనలను కూడా టీటీడీ అమలు చేస్తోంది.



## గాయపడిన గీత కార్మికుడిని పరామర్శించిన శ్రీనివాస్ గౌడ్

- ఆసుపత్రిలో బాధితుడికి ధైర్యం
- రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలని డిమాండ్
- గీత కార్మికులకు అండగా నిలవాలని విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 19 : నల్గొండ జిల్లా దోమలపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు సత్తయ్య గౌడ్ చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆదివారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్, సత్తయ్య గౌడ్‌కు అత్యుత్తమ వైద్యం అందించాలని కోరారు. ప్రమాదం నుంచి పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన వైద్య సేవలు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చెట్టుపై నుంచి పడి పది రోజులు గడిచినా ఇప్పటి వరకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఎవరూ బాధితుడిని పరామర్శించకపోవడం బాధాకరమని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ విషయమై నల్గొండ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి, ప్రభుత్వం తరపున అందాల్సిన ఎక్స్‌గ్రేషియాను వెంటనే మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో గీత కార్మికుడు చెట్టుపై నుంచి పడి మరణించినా లేదా తీవ్రంగా గాయపడినా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా చెట్టుపై నుంచి పడి సుమారు 600 మంది గీత కార్మికులు ప్రమాదాలకు గురయ్యారని పేర్కొన్న శ్రీనివాస్ గౌడ్, వారందరికీ ఎలాంటి జాప్యం లేకుండా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు..

# రాప్తాడులో ఎస్ఐఆర్‌పై ఎమ్మెల్యే పరిటాల సునీత సమీక్ష



- మరో ఐదు రోజుల్లో ఎన్యుమరేషన్ ఫారాలు పూర్తి చేయాలని ఆదేశం
- కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన

రాప్తాడు, జూలై 19 అనంత సూర్య: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు మరో ఐదు రోజుల మాత్రమే గడువు మిగిలి ఉన్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా పనిచేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, బీఎల్ఏలతో ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లను గుర్తించి, బీఎల్ఓలకు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీఎల్ఏలు ఇంటింటికి వెళ్లి మరోసారి పరిశీలన చేపట్టి, ఫారాల సమర్పణను పూర్తి చేయాలని సూచించారు. మ్యాపింగ్ కాని ఓట్లు, మరణించిన ఓటర్లు, డబుల్, డూప్లికేట్, షిఫ్టింగ్ ఓట్ల వివరాలను పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్ఏలకు అందజేశామని, వాటిని పరిశీలించి అవసరమైన సవరణలు పూర్తి చేయాలని తెలిపారు. అదేవిధంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అర్హులైన యువతను కొత్త ఓటర్లుగా నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మిగిలిన ఐదు రోజుల పాటు బీఎల్ఏలు డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి ప్రతి అర్హుడి నుంచి ఎన్యుమరేషన్ ఫారాలు తీసుకునేలా కృషి చేయాలని చెప్పారు. క్లస్టర్, యూనిట్, మండల కన్వీనర్లు, ముఖ్య నాయకులు ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు.

# పుట్టపర్తి రెవెన్యూ భవన్‌లో నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లోనూ అర్జీల స్వీకరణ
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..
- 1100 టోల్‌ఫ్రీ ద్వారా స్థితిగతుల తెలుసుకునే అవకాశం

పుట్టపర్తి, జూలై 19 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్ (ఎస్.ఆర్. శంకరన్ హాల్)లో సోమవారం (జూలై 20) జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సంబంధిత మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లోనే సమర్పించాలని సూచించారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలతో ఉన్నవారే జిల్లా కేంద్రంలో జరిగే పీజీఆర్ఎస్‌కు హాజరుకావాలని తెలిపారు. ప్రజలు రెవెన్యూ భవన్‌కు రావాల్సిన అవసరం లేకుండా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లా రెవెన్యూ భవన్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అన్ని జిల్లా శాఖల



అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదేశించారు.

# అనంతలో అత్యాధునిక ఆర్థోపెడిక్ చికిత్సలు - ఇండస్ హాస్పిటల్ ప్రారంభం

అనంతపురం, జూలై 19 అనంత సూర్య : ఆర్థోపెడిక్ సమస్యల చికిత్స కోసం ఇకపై బెంగుళూరు, హైదరాబాద్ వంటి మహానగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, అనంతపురం నగరంలోని బళ్లారి బైపాస్ రోడ్డులో నూతనంగా ప్రారంభించిన ఇండస్ హాస్పిటల్లో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ మదన్ కుమార్ రెడ్డి. స్నేహ రెడ్డి వెల్లడించారు. ఇండస్ ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులుతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, వైద్య నిపుణులు, ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ మదన్ కుమార్ రెడ్డి



మాట్లాడుతూ.. అనంతపురం ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆర్థోపెడిక్ వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఇండస్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్నపాటి ఎముక విరుగుడు (ఫ్రాక్చర్) చికిత్స నుంచి క్లిష్టమైన కీళ్ల మార్పిడి (జాయింట్ రీప్లేస్‌మెంట్), మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు, ట్రామా కేర్‌తో పాటు అన్ని రకాల ఆర్థోపెడిక్ చికిత్సలను అత్యాధునిక సాంకేతిక పరికరాలతో అందిస్తున్నామని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన వైద్య




బృందం, ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, అత్యున్నత ప్రమాణాల వైద్య పరికరాలతో రోగులకు నాణ్యమైన చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దీంతో రోగులు చికిత్స కోసం ఇతర నగరాలకు వెళ్లి అధిక ఖర్చు, సమయాన్ని వెచ్చించాల్సిన అవసరం ఉండదని, అనంతపురంలోనే అత్యుత్తమ వైద్య సేవలు పొందవచ్చని ఆస్పత్రి యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, వివిధ రంగాల ప్రముఖులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# హంద్రీనీవా ప్రాజెక్టు పరిరక్షణకు వైఎస్సార్‌సీపీ పోరుబాట







- చోళసముద్రం వద్ద కాలువ పరిశీలన..
- లైనింగ్ పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపణలు
- హంద్రీనీవా సామర్థ్యాన్ని 11,500 క్యూసెక్కులకు పెంచాలని డిమాండ్

అనంతపురం, జూలై 19 అనంత సూర్య: హంద్రీనీవా ప్రాజెక్టు పరిరక్షణతో పాటు గ్రేటర్ రాయలసీమ సాగునీటి హక్కుల సాధన కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని ఉధృతం చేస్తామని పార్టీ నేతలు ప్రకటించారు. పార్టీ నిర్ణయం మేరకు ఆదివారం ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం చోళస-ముద్రం సమీపంలో హంద్రీనీవా కాలువను వైఎ-స్సార్‌సీపీ నాయకులు పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్, టాస్క్‌ఫోర్స్ కమిటీ జిల్లా కోఆర్డినేటర్ నార్పల సత్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎంపీ రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, నైరుతిరెడ్డి తదితరులు రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి రెండు కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించి కాలువ లైనింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కృషితోనే హంద్రీనీవా ప్రాజెక్టు రూపుదిద్దుకుందని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కాలువ సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచే చర్యలు చేపట్టామని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం టెండర్లు రద్దు చేసి ప్రాజెక్టు సామర్థ్యాన్ని తగ్గించిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హంద్రీనీవా సామర్థ్యాన్ని 11,500 క్యూసెక్కులకు పెంచుతామని ప్రకటించారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను పూర్తి చేయడానికి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ హంద్రీనీవా లైనింగ్ పనుల్లో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, నాసిరకం పనుల వల్ల ప్రాజెక్టు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదన్నారు. మాజీ మంత్రి శైలజానాథ్ హంద్రీనీవా లైనింగ్ పనుల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశా-రు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ హంద్రీనీవా కాలువల విస్తరణ, లైనింగ్ పనులు నాసిరకంగా జరిగాయని ఆరోపించారు. ప్రభుత్వం చేపట్టిన పనులపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని కోరారు. నార్పల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ సాగునీటి హక్కుల సాధన కోసం గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్టుల టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని, రానున్న రోజుల్లో రాయలసీమ వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల కోసం ఉద్యమాన్ని

# గ్యాస్ ఏజెన్సీ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి



## జూలై 30న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సీఐటీయూ పిలుపు

పుట్టపర్తి, జూలై 19 అనంత సూర్య: ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీల్లో పనిచేస్తున్న కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, కార్మిక చట్టాల ప్రకారం అన్ని సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ జులై 30న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శులు బాబ్ జాన్, ముస్తాక్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం వంటగ్యాస్ సరఫరా చేస్తున్న గ్యాస్ డెలివరీ వర్కర్లు, ఏజెన్సీల్లో పనిచేస్తున్న ఇతర సిబ్బంది తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ ఏజెన్సీ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ తదితర చట్టబద్ధ హక్కులను కల్పించాలని ప్రభుత్వాన్ని, యాజమాన్యాలను కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం జులై 30న జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాలో గ్యాస్ ఏజెన్సీల్లో పనిచేస్తున్న కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ డెలివరీ వర్కర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అన్నదానం, అవగాహన



అనంతపురం, జూలై 19 అనంత సూర్య : నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్ పర్సన్ డాక్టర్. ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో ఎయిమ్ ఫర్ సేవ ఆశ్రమంలో విద్యార్థులకు అన్నదానంతో పాటు అవగాహన కల్పించారు. ఆదివారం శ్రీ స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో ట్రస్ట్ సభ్యులు ఓ ప్రభుత్వ ఉన్నతాధికారిని.. వారి సకారంతో అన్నప్రసాద కార్యక్రమము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని చదువులో కొనసాగించాలన్నారు. చదువులో విజయం సాధించగలిగితే భవిష్యత్తులో జీవితంలోనూ విజయం సాధిస్తామని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. పెద్దల ఆశీస్సులు ఉంటే జీవితంలో కుటుంబ బాధ్యతలు, జీవన విధానాలు అలవాడుతాయన్నారు. ప్రతి విద్యార్థి తన అనుకున్న లక్ష్యాలను చేరుకునే వరకు పట్టు వదలని శ్రమతో కష్టపడాలన్నారు. తోటి వారికి సహాయం చేసే గుణం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు స్వామి సత్యాత్మానంద, చక్రపాణి, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్‌పై క్యూ ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

## ప్రజలకు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ విజ్ఞప్తి




అనంతపురం, జూలై 19 అనంత సూర్య: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సేవలపై ప్రజలు క్యూ ఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ కోరారు. పీజీఆర్ఎస్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు ప్రజల సంతృప్తిని మెరుగుపరిచేందుకు ఈ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలతో పాటు నోటీసు బోర్డులు, హెల్ప్‌డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్ల వద్ద క్యూ ఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ సేవలు పొందిన అనంతరం ప్రజలు తమ మొబైల్ ఫోన్‌తో క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అధికారిక పోర్టల్‌లో తమ అభిప్రా-యాలను నమోదు చేయవచ్చని తెలిపారు. అలాగే ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం, మండల కార్యాలయాల్లో నిర్వహించే పీజీ ఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీలు సమర్పించాలని, అర్జీల స్థితిగతులను టోల్‌ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజలు పీజీఆర్ఎస్ సేవలను సద్వినియోగం చేసుకుంటూ తమ అభిప్రాయాలను తెలియజేసి సేవల మెరుగుదలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



## ముత్యాలంపల్లి ఆలయ ప్రాంగణంలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**• 18 మంది అరెస్ట్.. రూ.1.06 లక్షల నగదు, 16 సెల్‌ఫోన్లు స్వాధీనం**



రామగిరి, జూలై 19 అనంత సూర్య: జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్,ఆదేశాల మేరకు రామగిరి మండలం ముత్యాలంపల్లి గ్రామంలోని ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పేకాట జూదంపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించి 18 మందిని అరెస్ట్ చేశారు.ముత్యాలంపల్లి ఆలయ ప్రాంగణంలో పేకాట నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో సీఐ సి. మహమ్మద్ అలీ పర్యవేక్షణలో ఎస్ఐ ప్రదీప్, పోలీసు సిబ్బందితో కలిసి దాడి చేపట్టారు. ఈ దాడిలో 18 మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1,06,030 నగదు, 16 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ ప్రదీప్ తెలిపారు. జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇటువంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వారికి జిల్లా పోలీసుల కౌన్సెలింగ్



**• చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: పోలీసులు**

పుట్టపర్తి, జూలై 19 అనంత సూర్య: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, సస్పెక్ట్ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు నేరప్రవర్తనను పూర్తిగా విడనాడి, చట్టాలకు లోబడి సత్ప్రవర్తనతో జీవనం సాగించాలని సూచించారు.చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.పోలీసుల హెచ్చరికలను పట్టించుకోకుండా ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే, ఇప్పటికే ఉన్న కేసులతో పాటు కొత్త క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని స్పష్టం చేశారు.జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, అనుమానాస్పద కార్యకలాపాలపై నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## ధర్మవరంలో ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్న తోపుడు బండ్ల తొలగింపు

**రోడ్ల ఆక్రమణలపై పోలీసుల హెచ్చరిక**



ధర్మవరం, జూలై 19 అనంత సూర్య; శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న రహదారులపై అడ్డంగా నిలిపిన తోపుడు బండ్లను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు.డీఎస్పీ, వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్ఐ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు అడ్డంకిగా ఉన్న తోపుడు బండ్లను తొలగించి, నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు.భవిష్యత్తులో కూడా రహదారులను ఆక్రమిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు, వ్యాపారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు..

## గాయపడిన టీడీపీ నాయకుడు రామును పరామర్శించిన సామకోటి ఆదినారాయణ



పుట్టపర్తి, జూలై 19 అనంత సూర్య; పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటక నాగేపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు రాము (చిట్టి) ఇటీవల ప్రమాదంలో కాలు విరగడంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ప్రస్తుతం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆదివారం పరామర్శించారు.ఈ సందర్భంగా రాము ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యుల సూచనల మేరకు పూర్తిగా కోలుకునే వరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు శ్రీరాములుతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ వేంకటేశ్వర ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభించిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి





**• నాణ్యమైన ఆహారంతో వినియోగదారుల విశ్వాసం పొందాలని సూచన**

**• అనారోగ్యంతో ఉన్న టీడీపీ కార్యకర్తను పరామర్శించిన మాజీ మంత్రి**

బుక్కపట్నం, జూలై 19 అనంత సూర్య: బుక్కపట్నం మండలం ముదిగుబ్బకు వెళ్లే నూతన రహదారి పక్కన ఏర్పాటు చేసిన శ్రీ వేంకటేశ్వర ఫ్యామిలీ రెస్టారెంట్‌ను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి రెస్టారెంట్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని సూచించారు.వినియోగదారులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారంతో పాటు ఉత్తమ సేవలు అందించడం ద్వారా మంచి గుర్తింపు సాధించాలని అన్నారు.స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించే ఇటువంటి వ్యాపార సంస్థలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.అనంతరం రెస్టారెంట్



నిర్వాహకులు అనిల్‌కుమార్, దీప్తిలను అభినందించి వారి వ్యాపారం విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు.అదే రోజు బుక్కపట్నంలో అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ కార్యకర్త పెయింటర్ శ్రీనివాసులను మాజీ మంత్రి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పడంతో పాటు ఆర్థిక సహాయం అందజేశారు. వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఎస్సీ హాస్టల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్





**• విద్యార్థులతో కలిసి భోజనం.. విద్యా సామగ్రి పంపిణీ**

**• విద్యాశాఖలో సమూల మార్పులు తీసుకొచ్చిన నాయకుడు మంత్రి నారా లోకేష్ అని వ్యాఖ్య**

అనంతపురం, జూలై 19 అనంత సూర్య: అనంతపురం ఆర్ అండ్ బి అతిథి గృహం సమీపంలోని ఎస్సీ హాస్టల్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం సందర్శించారు. హాస్టల్‌లో విద్యార్థులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ప్రభుత్వం అందజేస్తున్న యూనిఫామ్‌లు, ట్రంకు పెట్టెలు, నైట్ డ్రెస్‌లు, భోజన ప్లేట్లు, షూస్ తదితర విద్యా సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగంలో సమూల మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు పోటీ నెలకొన్నదని పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో విద్యారంగం నిర్లక్ష్యానికి గురైందని విమర్శించిన ఆయన, ప్రస్తుతం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో విద్యా కానుకలు అందిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది సుమారు 63 లక్షల మంది విద్యార్థులకు రూ.10 వేల కోట్ల వ్యయంతో 'తల్లికి వందనం' పథకం అమలు చేశామని, ఈ ఏడాది మరో లక్ష మంది అదనపు లబ్ధిదారులను చేర్చినట్లు చెప్పారు.అనంతపురం నగరంలో ఆరు ప్రభుత్వ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడంతో 90 మంది అదనపు ఉపాధ్యాయులు నియమితులయ్యారని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

## ననకోట ఎంజెపి గురుకులంలో ఈనెల 22న ఇంటర్మీడియట్ తరగతుల ప్రారంభం






**• మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల**
**• సునీత చేతుల మీదుగా ప్రారంభం**
**• పాఠశాలలో ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే సునీత**

రామగిరి, జూలై 19 అనంత సూర్య: రామగిరి మండలం నసనకోట ఎంజెపి గురుకుల బాలికల పాఠశాలలో ఈనెల 22వ తేదీన ఇంటర్మీడియట్ తరగతులు అధికారికంగా ప్రారంభం కానున్నాయి.ఇటీవల ప్రభుత్వం ఇంటర్మీడియట్ కళాశాలకు అనుమతి మంజూరు చేయగా, అడ్మిషన్ల ప్రక్రియ దాదాపు పూర్తయింది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత కలిసి ఈ తరగతులను ప్రారంభించనున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే




పరిటాల సునీత ఆదివారం పాఠశాలను సందర్శించి, తరగతి గదులు, హాస్టల్, వంటశాల, స్టోర్‌రూమ్ తదితర విభాగాలను పరిశీలించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు, ఉపాధ్యాయులకు సూచించారు. వంటశాలలో సిద్ధం చేసిన భోజనం, కూరల నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించిన ఆమె, స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన కూరగాయలు, కిరాణా సరుకుల నాణ్యతతో పాటు వాటి గడువు తేదీలను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎల్లప్పుడూ తాజా ఆకుకూరలు, కూరగాయలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, గడువు ముగిసిన సరుకులను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ, ఈ ప్రాంత బాలికలకు రెసిడెన్షియల్ విధానంలో ఇంటర్మీడియట్ విద్య అందించాలన్న ఎన్నో ఏళ్ల కల ఈ నెల 22న సాకారం కానుందని పేర్కొన్నారు. ఈ విద్యాసంస్థ ప్రారంభంతో గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుందని ఆమె తెలిపారు.

## రైతు సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



అగళి,జులై 19,అనంత సూర్య: :అమరాపురం మండలంలో విరుపసముద్రం గ్రామంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటించి స్థానిక రైతుల సమక్షంలో పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం సమస్య ఎక్కడ ఉందో రైతులకు తెలుసుకున్నారు ఎరువులు విత్తనాలు రైతులకు అందించే విద్యుత్ సదుపాయం లో వోల్టేజ్ సమస్య వ్యవసాయ అధికారులు క్షేత్రసాయిలో పర్యటిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు మీ వ్యవసాయ కేంద్రాలకు విత్తనాలు ఎరువులు, సక్రమంగా వస్తున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు తదనంతరం సింగల్ విండో అధ్యక్షుడు గణేష్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి ఆప్యాయంగా మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు ఇటువంటి క్షేత్రస్థాయి పర్యటనలు మండల పర్యటనలు చేయడం రైతులకు రైతు సమస్యలను తెలుసుకునుటకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం తెలియజేశారు.

అనంత సూర్య
తెలుగువార్త
సోమవారం 20 జూలై 2026



- ఎస్సీ హాస్టల్ విద్యార్థులతో మమేకమవుతూ సమస్యలు తెలుసుకున్న దగ్గుపాటి
- విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన కిట్లను అందజేసిన ఎమ్మెల్యే
- ఈ ఏడాది మరో లక్ష మందికి అదనంగా తల్లికి వందనం
- విద్యాశాఖపై దేశవ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయన్న ఎమ్మెల్యే దగ్గుపాటి



## జగన్ మామయ్య కాదు..
# తుగ్లక్ మామయ్య !
### — ఎమ్మెల్యే దగ్గుపాటి —



**అనంతపురం, జూలై 19 అనంతసూర్య :**

పిచ్చి తుగ్లక్ విధానాలతో విద్యార్థి లోకంలో జగన్.. తుగ్లక్ మామయ్యగా ముద్ర వేసుకున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశారు. నగరంలోని ఆర్.అండ్.బి అతిథి గృహం సమీపంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఎస్సీ, బిసి హాస్టల్ విదార్థిని, విద్యార్థులతో మమేకమవుతూ గడిపారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన సామాగ్రిని ఆయన అందజేశారు. ఇందులో స్కూల్ యూనిఫామ్, నైట్ డ్రెస్, స్పోర్ట్స్ షూ, ట్రంకు పెట్టెలు, భోజనం ప్లేట్లు వంటివి ఉన్నాయి. ముందుగా వసతి గృహానికి వచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటికి విద్యార్థులు, వార్డెన్లు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వసతి గృహాన్ని మొత్తం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మమేకమవుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితోనే భోజనం చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన కిట్లను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో అనేక మార్పులు తీసుకొచ్చారన్నారు. దాని ఫలితంగా ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు పోటీ ఏర్పడిందన్నారు. విద్యార్థులకు అందించే పుస్తకాలు, బ్యాగులు, చివరకు బెల్టుల మీద కూడా జగన్ రెడ్డి ఫోటోలు వేయించుకొని పిచ్చి తుగ్లక్ తరహాలో వ్యవహరించారన్నారు. దాని ఫలితంగా విద్యార్థులు ఆయన్ని తుగ్లక్ మామయ్య అని పిలుస్తున్నారన్నారు. పాఠశాలల్లో రాజకీయాలు ఉండకూడదన్న ఉద్దేశంతో మంత్రి నారా లోకేష్ ఇప్పుడు సర్వేపల్లి రాధాకృష్ణ వంటి మహనీయుల ఫోటోలుతో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ ధనాన్ని దుబారా చేస్తూ కిట్లు కొనుగోలు చేశారని విమర్శలు చేశారు. వీటిని 10 శాతానికి పైగా తగ్గించిన ఘనత మంత్రి నారా లోకేష్‌కే దక్కుతుందన్నారు. ఇంటర్మీడియట్ కళాశాలల్లో సైతం మధ్యాహ్నం భోజనాన్ని ప్రవేశపెట్టారన్నారు. గతంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో దొడ్డు బియ్యం ఉంటే ఇప్పుడు సన్న బియ్యంతో భోజనం అందజేస్తున్నారన్నారు. అంతేకాకుండా గత ఏడాది 63 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం కింద పదివేల కోట్ల రూపాయలు అందజేస్తే.. ఈ ఏడాది 64 లక్షల మందికి పదివేల కోట్లకు పైగా తల్లికి వందనం నిధులు ఈనెల 22వ తేదీన విడుదల చేయనున్నారని చెప్పారు. విద్యాశాఖలో ఆయన తెచ్చిన మార్పులు దేశంలోని ఆదర్శంగా నిలుస్తున్నాయని దగ్గుపాటి అన్నారు. అనంతపురం నగరంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న పాఠశాలలను ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ చేసినట్లు తెలిపారు. దీనివలన 90 మంది ఉపాధ్యాయులు అదనంగా అనంతపురం నగరానికి వచ్చారని తెలిపారు.

విద్యావ్యవస్థలో రానున్న రోజుల్లో మరిన్ని మార్పులు చూస్తారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో టెలిఫోన్ భవన్ సాయిబాబా దేవాలయ అధ్యక్షుడు వైకుంఠం జయచంద్ర చౌదరి, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, మాజీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, క్లస్టర్ ఇంచార్జ్ లు పొట్లూరి కేశవ నాయుడు, సాకే లక్ష్మీనరసింహ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి నాయుడు, టిడిపి నాయకులు సింగవరం రవి, వెంకట సుబ్బన్న, హాస్టల్ వార్డెన్ నాగర్జున, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సి బి ఎస్ ఈ టెన్త్ హిందూపురం లోటస్ స్కూల్ టాపర్ అబ్దుల్ రాజిక్

అగళి,జులై 19,అనంత సూర్య: :సీబీఎస్ఈ 10వ తరగతి రెండో విడత బోర్డ్ పరీక్షా ఫలితాలను శనివారం విడుదల చేయడంతో అగళి మండలం అగళి గ్రామం మండల పరిషత్ కో ఆప్షన్ మెంబర్ నసీర్ సాబ్, గుల్నాజ్ దంపతుల కుమారుడు ఎన్. అబ్దుల్ రాజిక్ 460/500 మార్కులు సాధించి హిందూపురం పూలకుంట లో ఉన్న లోటస్ స్కూల్ టాపర్ గా నిలిచాడు.సి బి ఎస్ సి ఈ ఏడాది 2026 నుంచే ఏడాదికి రెండుసార్లు బోర్డ్ పరీక్షలు నిర్వహించే సరికొత్త విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఈ నూతన విధానంలో భాగంగా నిర్వహించిన ఈ ఏడాది ఫిబ్రవరి 17 నుంచి మార్చి 11 వరకు ప్రధాన బోర్డు పరీక్షలు జరగగా, రెండో బోర్డ్ పరీక్షలను మే 15 నుంచి మే 21 వరకు నిర్వహించారు. రెగ్యులర్ విద్యార్థులు రాసిన ఈ రెండు పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు వస్తే వాటినే తుది ఫలితంగా బోర్డు పరిగణించింది. హిందూపురం లోటస్ స్కూల్లో చదువుతున్న అబ్దుల్ రాజిక్ ఇంప్రూమెంట్ కోసం రాయగా తన స్కోర్ ను 460/500 మెరుగు పరచుకోవడంతో లోటస్ స్కూల్ టాపర్ గా నిలిచాడు. ప్రస్తుతం అబ్దుల్ రజాక్ గుంటూరులోని మాస్టర్ మైండ్ కళాశాలలో ఎం ఈ సి గ్రూపు తీసుకుని మొదటి ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తున్నాడు.తమ పాఠశాలలో అత్యుత్తమ మార్కుల సాధించి టాపర్ గా నిలిచిన అబ్దుల్ రజాక్ ను లోటాస్ స్కూల్ పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది యాజమాన్యం అబ్దుల్ రాజిక్ ను అభినందించారు..



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



సింగనమల,జులై19,అనంత సూర్య: సింగనమల మండలం పరిధిలోని లోలూరు గ్రామానికి చెందిన బండి వీరనారప్పకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా మంజూరైన 1,74000వేల రూపాయలు చెక్కును ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద మరియు అర్హులైన కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఆసరాగా నిలుస్తోందని తెలిపారు.ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.చెక్కు అందుకున్న బండి వీరనారప్ప కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే బండారు శ్రావణికు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అనిల్ కుమార్ యాదవ్, శోధన పల్లి మాజీ సర్పంచ్ రామంజి,పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతులకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తాం




అనంత సూర్య :ఎన్‌పీ కుంట మండలంలో దశాబ్దాలుగా సాగులో ఉన్న అర్హులైన రైతులకు వెంటనే భూ పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ, రైతు రక్షణ సమితి అధ్యక్షుడు యాదల్ల రాజేష్ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు రక్షణ యాత్ర నేడు ఐదవ రోజుకు చేరుకుంది.ఐదవ రోజు యాత్రలో భాగంగా తూర్పు నడిమిపల్లి మరియు మర్రికొమ్మదిన్నె పంచాయతీలలో ప్రచార రథంతో గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రైతులను, గ్రామ ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములకు ఇప్పటికీ భూ పట్టాలు ఇవ్వకపోవడం తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా తమ సమస్యలకు పరిష్కారం లభించలేదని, వెంటనే అర్హులైన రైతులకు భూ పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా యాదల్ల రాజేష్ మాట్లాడుతూ,



దశాబ్దాలుగా సాగులో ఉన్న అర్హులైన రైతులకు వెంటనే భూ పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, రైతుల సమ్మతి లేకుండా ఎలాంటి భూసేకరణ చేపట్టకూడదని అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బాబా, ప్రభాకర్, నరసింహులు, ప్రసాద్, రైతులు, గ్రామ పెద్దలు, యువకులు, రైతు రక్షణ సమితి నాయకులు పాల్గొన్నారు.

- చెత్తలో బయో మెడికల్ వేస్ట్ మిళితం ప్రాణాంతకం
- అనంత మున్సిపాలిటీ, పీసీబీపై పోరుకు సన్నద్ధం
- సోషల్ యాక్టివిస్ట్ డిస్కవర్ అనంతపురం అనిల్ కుమార్




## కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడితే..
# వదిలే ప్రసక్తే లేదు

**అనంతపురం, జులై 19 అనంతసూర్య :**

ప్రజల ఆరోగ్యాలు, కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడే వారు ఎవరైనా సరే వదిలే ప్రసక్తి లేదని సోషల్ యాక్టివిస్ట్, **'డిస్కవర్ అనంతపురం'** అనిల్ కుమార్ స్పష్టంగా తెలియజేశారు. జిల్లాలోని పలు ల్యాబ్‌లు, ప్రైవేట్, గవర్నమెంట్ హాస్పిటల్ నుండి వెలువడే బయో మెడికల్ వ్యర్థాలు, శరీర భాగాలు చెత్తలో కలిసి నిప్పు ద్వారా పొగగా మారితే.. చాలా ప్రమాదం అన్నారు. ఆ వ్యర్థాల నుండి వెలువడే పొగ విషంతో సమానమని, ఆ పొగను పీల్చిన వారి ఆరోగ్యాలు పూర్తిగా దెబ్బ తినడమే కాకుండా, కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కూడా పోయే అవకాశం ఉందన్నారు. ఇదే విషయాన్ని ఆధారాలతో.. బయో మెడికల్ వ్యర్థాలను చెత్తలో కలుపుతున్న దృశ్యాలను వీడియోలను కూడా నగరపాలక సంస్థ అధికారులకు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు కూడా చేశామని, అయితే వారి నుండి చూస్తాం, చర్యలు తీసుకుంటామని నెలల తరబడి చెబుతున్నారే కానీ.. ఆ దిశగా అడుగులు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇది ఇలా ఉంటే, బయో మెడికల్ వేస్ట్ నిర్వహణకు సంబంధించి అటు ప్రజలకు, ఇటు కార్మికులకు ఎవరికి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులపై ఉందన్నారు. అయితే అనంతపురంలోని పీసీబీ అధికారుల నిర్లక్ష్యం తారస్థాయికి చేరిందని, ఇదే తరహాలో.. తిరుపతి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి బయో మెడికల్ వేస్ట్ నిర్వహణలో అలసత్వం, విధి నిర్వహణను కాసులు పరంగా మార్చుకొని నగరాన్ని కలుషితం చేయడంపైనే అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా ఆదాయానికి మించిన రూ.కోట్ల ఆస్తులు లభించాయని, అదే తరహాలో అనంతపురం పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారిపై కూడా అవినీతి నిరోధక శాఖ అధికారులు దృష్టి పెట్టాలని, బయో మెడికల్ వేస్ట్‌కు సంబంధించి చెత్తలో కలిపేసి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్న పక్కా ఆధారాలను పలుమార్లు ఆమె దృష్టికి తీసుకుపోయినా.. ఫలితం లేకుండా పోయిందని, ఆమె ఇక్కడికి వచ్చి ఆరు నెలలు గడిచిపోతున్నా, ఇంకా సమయం కావాలని చెబుతూ ఉండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఇలాంటి అధికారుల అలసత్వం, కాసుల కక్కుర్తి కారణంగా ఇంకెందరి కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బయో మెడికల్ వేస్ట్‌పై అన్ని శాఖల అధికారులు సరైన నిర్ణయం తీసుకునే వరకు పోరాటమే శరణ్యంగా ఆందోళనకు శ్రీకారం చుడుతున్నామని స్పష్టంగా తెలియజేశారు. ఇదే విషయంపై నేషనల్ గ్రీన్ ట్రిబినల్ దృష్టికి కూడా తీసుకొని పోతున్నామని, కార్మికులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని, అందుకు కారణమైన అనంతపురం మున్సిపాలిటీ అధికారులను, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులపై తమ 'పోరుబాట' కొనసాగిస్తామని స్పష్టంగా తెలిపారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405